సాక్షి
మహబూబాబాద్
శనివారం । 27 । జనవరి । 2024



16 కిలోల గంజాయి స్వాధీనం

కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి వద్ద 16కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. - 8లో▸



బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి

మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్ట్‌షాపులపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.8^0/17.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ కాస్త చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విద్యారంగ సమస్యలపై చొరవచూపాలి



మహబూబాబాద్ అర్బన్: విద్యారంగ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ముందుగా సీనియర్ నాయకులు తడకమల్ల బ్రహ్మం టీఎస్ యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, మూడు డీఏలను ప్రకటించాలన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు ఇవ్వాలని, ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి పాటుపడాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సంజీవ, కె.శ్రీనివాస్, నాయకులు ఏ.కుమార్, నాగేశ్వర్‌రావు, హరినాయక్, వీరస్వామి, వెంకట్, బి.సౌభాగ్య, రాణి, మైసయ్య, సోమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఎంపిక

మహబూబాబాద్ అర్బన్: జాతీయ విద్యా ప్రణాళిక నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు డీఈఓ రామారావు శుక్రవారం తెలిపారు. 'సంపూర్ణ పాఠశాల అభివృద్ధికి పాఠశాల అంతటా సమ్మిళిత నాయకత్వ పర్యావరణ వ్యవస్థ' అనే ప్రధాన అంశంపై ఈ నెల 29నుంచి 31వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే ఈ సదస్సులో ఉపాధ్యాయులు పాల్గొంటారు. పెనుగొండ ప్రభుత్వ పాఠశాల భౌతిక,రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు, విద్యా పరిశోధకుడు వి.గురునాథరావు, నెల్లికుదురు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

జాతర పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర పనులన్నీ ఈనెలాఖరుకల్లా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మేడారంలో జరుగుతున్న జాతర పనులను శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్‌తో కలిసి మంత్రి సీతక్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేడారంలో వీవీపీ పార్కింగ్ స్థలం, ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జంపన్నవాగులోని ఏర్పాట్లను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. కొత్తూరు ప్రాంతంలోని తాత్కాలిక జీవి షీట్స్ మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. అనంతరం కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. సారలమ్మ పూజారి కాక రంజిత్ సారలమ్మ గుడి సమీపంలో మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్ ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్కను కోరగా అన్నీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ రోడ్డు పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేనటువంటి విధంగా డబ్బులు చెల్లించకుండా దైవ దర్శనం జరిగే ప్రసిద్ధ ఆలయ ప్రాంతం మన మేడారమని అధికారులు పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ, డీఎస్పీ రవీందర్, ఈఓ రాజేంద్రర్, డీపీఓ వెంకయ్య, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

కేయూలో నేడు ఓరియంటేషన్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో డిగ్రీ (బికాం, బీబీఏ) అధ్యాపకులకు రిపోర్టు రైటింగ్‌పై ఈనెల 27న ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కట్ల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల సెమినార్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, విభాగం అధిపతి ఆచార్య ఎస్.నర్సింహాచారి, డీన్ ఆచార్య పి.అమరవాణి, ఆచార్య పి.వరలక్ష్మి, అడ్జెంట్ ఆచార్యులు కృష్ణమాచార్య పాల్గొంటారని పేర్కొన్నారు.

పాలన మరింత చేరువకావాలి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా గణతంత్ర వేడుకలు
- స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న స్టాళ్ల ప్రదర్శన



ప్రసంగిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: ప్రజలకు పాలన మరింత చేరువ కావాలని, అందుకు ప్రభుత్వం పాటుపడుతుందని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కలెక్టర్ ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేశారు. తర్వాత కలెక్టర్ అద్వైత్ కుమార్, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కాగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాళ్ల ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

అన్ని వర్గాలకు స్వేచ్ఛ..

సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక, సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అద్వైత్‌కుమార్ అన్నారు. పారదర్శక పాలన అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో దాదాపు 9లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వినియోగించుకుంటున్నారన్నారు. గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 2,44,506 దరఖాస్తులు స్వీకరించామన్నారు.

వంద పడకల ఆస్పత్రి అప్‌గ్రేడ్..

జిల్లాలోని 100 పడకల ఆస్పత్రిని 330 పడకలకు అప్‌గ్రేడ్ చేశామన్నారు. వైద్యకళాశాల కోసం రూ.40కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. 139 పల్లె దవాఖానాల్లో వైద్యాధికారులు ఉన్నారని, జిల్లాలో 20 పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖాన, రెండు సీహెచ్‌సీల ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

వ్యవసాయం రంగంపై దృష్టి..

వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు రైతుబీమా రూ.5లక్షలు అందిస్తున్నామన్నారు. 297 మందికి రూ .14కోట్లు అందించామన్నారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ ద్వారా ఆయిల్‌పామ్ అభివృద్ధికి 7,000 ఎకరాలకు గాను 2,249 ఎకరాలకు రూ.4కోట్ల ఆర్థిక ప్రగతి సాధించామన్నారు. మత్స్యశాఖ ద్వారా 1,5000 టన్నుల చేపలు, 618 టన్నుల రొయ్యల ఉత్పత్తి జరిగిందని పేర్కొన్నారు.

బియ్యం సరఫరా..

జిల్లాలో 557 రేషన్ షాపుల ద్వారా 4,512 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. 216 కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు దరతో 9,630మంది రైతుల నుంచి 53మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ.152కోట్లు రైతు ఖాతాల్లో జమ చేశామన్నారు. 461 జీపీల్లో ట్రాక్టర్లు, ట్యాంకర్లు, ట్రాలీలు ఉన్నాయని, ఇంటింటా చెత్త సేకరణ చేసి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామన్నారు.

పథకాల అమలు..

ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాలను ప్రవేశపెటిందన్నారు. మహాలక్ష్మి పథకం, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, యువ వికాసం పథకాలను అమలు చేయనుందన్నారు. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించామన్నారు.

సమరయోధులకు సన్మానం

గణతంత్ర వేడుకల్లో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఘనంగా సన్మానించారు.



జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



స్టాళ్లను సందర్శిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ప్రశంస పత్రాల ప్రదానం..

జిల్లాలోని పలుశాఖల్లో పనిచేస్తున్న 184 మంది ఉత్తమ అధికారులకు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ ప్రశంసపత్రాలు అందజేశారు. వీరిలో 28 మంది జిల్లా అధికారులు ఉన్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏతో పాటు పాలు పలు శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. కాగా వాటిని కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ సందర్శించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ స్ప్రేయర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డేవిడ్, లెనిన్ వత్సల్ టొప్పో, డీఎఫ్ఓ రవికిరణ్, ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, జిల్లా అధికారులు, పలు పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంస - 8లో▸

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు తైక్వాండోకు సంబంధించి విన్యాసాలు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు దేశభక్తి గీతాలకు నృత్యాలు చేశారు. జిల్లా కేంద్రంలో టీఎస్ ఆర్‌డబ్ల్యూఎస్ పాఠశాల విద్యార్థులు జానపద గీతాలకు నృత్యాలు చేశారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జెడ్పీలో జెండా ఆవిష్కరణ



జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న జెడ్పీ సీఈఓ రమాదేవి



కోర్టులో జెండాకు వందనం చేస్తున్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ రమాదేవి శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖ కార్యాలయంలో డీఐఈఓ సమ్మెట సత్యనారాయణ జెండా ఆవిష్కరించారు. ఎంఈఓ కార్యాలయంలో కోఆర్డినేటర్ లింగల సాగర జెండా ఆవిష్కరించారు. బీఎస్పీ కార్యాలయంలో బీస్పీ రాష్ట్ర కార్యదర్శి, ఈస్ట్‌జోన్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్, బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

కోర్టు, పోలీసు, డీసీసీ కార్యాలయాల వద్ద..

మహబూబాబాద్ రూరల్ : మానుకోట పట్టణంలోని జిల్లాకోర్టు, జిల్లా పోలీసు కార్యాలయం, డీసీసీ కార్యాలయాల వద్ద గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్, పోలీసు కార్యాలయ ఆవరణలో ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.



జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్

సమాచారం కోసం దరఖాస్తు

దోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పాలకవర్గంలోని కొందరు కౌన్సిలర్లు తమ కార్యాలయంలోని సమాచారం కోసం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. గతంలో విధులు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ల హయాంలో జారీ చేసిన చెక్కుల వివరాల కోసం ముగ్గురు కౌన్సిలర్లు వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్నారు. కమిషనర్ బి.తిరుపతి హయాంలో జారీ చేసిన చెక్కుల వివరాల కోసం 15వ వార్డు కౌన్సిలర్ కాలా మొనికాజైన్, కమిషనర్ కె.శ్రీనివాసరావు హయాంలో జారీ చేసిన చెక్కుల వివరాల కోసం 6వ వార్డు కౌన్సిలర్ తేజావత్ సంధ్యారాణి, ప్రస్తుత కమిషనర్ మున్వర్ అలీ జారీ చేసిన చెక్కుల వివరాల కోసం13వ వార్డు కౌన్సిలర్ పోటీ జనార్దన్‌రావు సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయించారు. పాలకవర్గంలో సభ్యులుగా ఉండి ప్రతీ సమావేశంలో పాల్గొంటూ ముగ్గురు కమిషనర్లు మారిన తర్వాత వివరాల కోసం దరఖాస్తు చేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇటీవల మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగమయ్యాయని జిల్లా కలెక్టర్‌కు కౌన్సిలర్లు ఫిర్యాదు చేయడంతో కార్యాలయంలోని క్యాష్‌బుక్‌తో సహా కొన్ని రికార్డులను విచారణ నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.



దోర్నకల్ మున్సిపల్ కార్యాలయం

సెలవులో కమిషనర్..

ప్రస్తుత కమిషనర్ మున్వర్ అలీ శుక్రవారం సెలవుపై వెళ్లారు. మున్సిపాలిటీలో పలు అభియోగాలపై ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో కమిషనర్ సెలవుపై వెళ్లడం చర్చగా మారింది. 2018 ఆగస్టులో మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 8 మంది కమిషనర్లు మారగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న మున్వర్ అలీ సెలవుపై వెళ్లడంతో ఆయన తిరిగి విధుల్లో చేరరనేప్రచారం జరుగుతోంది.



తాటికల్లు మంచిగున్నది..

మహబూబాబాద్ మండలం సోమ్లాతండా గ్రామ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న తాటి చెట్టుపై రామ చిలుకలు కల్లు తాగాయి. అదికూడా కుండనుంచి కాకుండా నేరుగా గెల నుంచే లాగేశాయి. ఈ దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

త్వరలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు:ఇందిరమ్మ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆర్డీఓ నర్సింగరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని, అభివృద్ధి విషయంలో రాజీ లేదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో నియోజకవర్గంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు అర్హులకు అందేలా చొరవ చూపుతానన్నారు. అన్ని శాఖలపై సమీక్ష నిర్వహించి నిలిచిన పనులు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గానికి తొలి విడత రూ.10 కోట్లు ఇచ్చేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, తహసీల్దార్ వినోద్‌కుమార్, నాయకులు నిరంజన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, నరేందర్‌రెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, జలకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరులో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

గ్రీన్‌ల్యాండ్స్ లొల్లి!

- మానుకోట మున్సిపాటీలో కబ్జాకు గురవుతున్నాయని ఆరోపణ
- లేవుట్ లేకుండా చేసిన వెంచర్లే ఎక్కువ
- నష్టపోతున్న కొనుగోలుదారులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో విలువైన గ్రీన్‌ల్యాండ్స్ కబ్జాకు గురవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కబ్జాకు గురవుతున్నాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలని కౌన్సిలర్లు కోరుతున్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఈ విషయంపై అధికారులతో వాగ్వాదం చేశారు. ఈ క్రమంలో వారం క్రితం చైర్మన్‌తో పాటు కమిషనర్, ఆరోపణలు చేసిన కౌన్సిలర్లు ఆ స్థలాలను పరిశీలించి విచారణ చేశారు. ఇదిలా ఉండగా రియల్టర్లు కాసులకు కక్కుర్తి పడి లేఅవుట్ లేకుండానే వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

కబ్జాలు..

మున్సిపాలిటీలో 74 గ్రీన్‌ల్యాండ్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కాగా ఈదుల పూసపల్లి రోడ్డులో రాళ్లవాగు వద్ద సుమారు నాలుగు ఎకరాల్లో వెంచర్ చేయగా గ్రీన్ ల్యాండ్ కబ్జాకు గురైందని ఆరోపణలు వస్తున్నాయి. 19 వార్డులో, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న గ్రీన్‌ల్యాండ్స్ కబ్జా జరిగాయని ఆరోపిస్తున్నారు. అలాగే శనిగపురం రోడ్డులోని ఓ వెంచర్‌లో గుట్టను గ్రీన్ ల్యాండ్‌గా చూపించారని, ఆప్రాంత కౌన్సిలర్లు అంటున్నారు. కాగా కబ్జాలపై అధికారులు విచారణ చేస్తున్నారు.



అనంతారం రోడ్డులో చేసిన అనధికార వెంచర్



గ్రీన్‌ల్యాండ్స్ కబ్జాల ఆరోపణలపై విచారణ చేపట్టిన చైర్మన్, కమిషనర్, అధికారులు(ఫైల్)

లేవుట్ లేని వెంచర్లే ఎక్కువ..

మున్సిపాలిటీ పరిధిలో కేవలం నాలా అనుమతి తీసుకుని లేఅవుట్ కోసం దరఖాస్తు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. కాగా టీఎస్ బీపాస్ ద్వారా కేవలం 14 వెంచర్లకు అనుమతి తీసుకుంటే.. 20కి పైగా వెంచర్లకు అనుమతులు లేకుండానే ప్లాట్లు చేసి విక్రయాలు జరుపుతున్నారు. అనధికార వెంచర్లతో కొనుగోలుదారులతో పాటు మున్సిపాలిటీ పదిశాతం గ్రీన్ ల్యాండ్, 15శాతం మార్టిగేజ్ భూమి, ఆదాయపరంగా నష్టపోవాల్సి వస్తోంది. కాగా లేఅవుట్ లేని వెంచర్లు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కేసులు పెట్టాలని, అలాగే ప్లాట్లు కొనుగోలు చేయవద్దని వెంచర్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు.

లేఅవుట్ ఉన్నట్లు..

కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ ఉన్నట్లు దరఖాస్తు చేసుకున్న నంబర్‌ను చూపిస్తూ కొనుగోలుదారులను బురిడీ కొట్టిస్తున్నారు. వెంచర్ చుట్టూ ప్రహరీ, డ్రైయినేజీ, విద్యుత్ స్తంభాలు, రోడ్ల నిర్మాణం, అందంగా కనిపించే విధంగా ఆర్చ్‌లు ఏర్పాటు చేసి కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నారు. ఇలా కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని, అనధికార వెంచర్లను తొలగించాలని పట్టణ ప్రజలు, కౌన్సిలర్లు కోరుతున్నారు.

కబ్జా జరగలేదు..

మున్సిపాలిటీ పరిధిలో గ్రీన్ ల్యాండ్స్ కబ్జా జరగలేదు. వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాం. పలువురు కౌన్సిలర్లు చేసిన ఆరోపణలతో ఆ స్థలాలను చూపించాం. లేవుట్ లేని ప్లాట్లు కొనుగోలు చేయవద్దు. అలాంటి వెంచర్లలో నిర్మాణాలను తొలగిస్తున్నాం. లేఅవుట్ లేని ప్లాట్లకు అనుమతి ఇవ్వడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అలాంటి ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయవద్దని ఆ వెంచర్ల నంబర్లు ఇచ్చాం. రిజిస్ట్రేషన్ కాకుండా మరోసారి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు పంపుతాం.

- నవీన్, టీపీఓ, మానుకోట మున్సిపల్

క్లుప్తంగా

గూర్ఖాకు దాతల చేయూత



రాణాకు నగదు అందజేస్తున్న దాతలు

సాక్షి స్పందన

డోర్నకల్‌ : డోర్నకల్‌లో గూర్ఖాగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన డమ్మర్‌ రాణా గుండె జబ్బు చికిత్స కోసం దాతలు చేయూతనందిస్తున్నారు. పేదరికానికి తోడు గుండె జబ్బు బారిన పడటం, నేపాల్‌ దేశస్తుడు కావడంతో రేషన్‌ కార్డు లేక చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇటీవల సాక్షి దినపత్రికలో గూర్ఖాకు గుండె జబ్బు పేరుతో కథనం ప్రచురితం కాగా దాతలు స్పందిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వరంగల్‌కు చెందిన న్యాయవాదులు రూ.5 వేల నగదు అందించారు. శుక్రవారం డోర్నకల్‌ జెడ్పీఎస్‌ఎస్‌ 2005–06 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు డమ్మర్‌ రాణా ఇంటికి వచ్చి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వీరబోయిన రమేష్‌, సీహెచ్‌ రవి, భూక్యా రాజేష్‌, ఎల్‌.విజయ్‌, జక్కుల నరేష్‌, ఎస్‌కె రేష్మా, ధరావత్‌ రేష్మా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



గట్టయ్య మృతదేహం

మడికొండ : గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మడికొండ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన దండింగం గట్టయ్య(70) అనారోగ్యంతో పాటు అప్పులు అధికమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన గట్టయ్య శుక్రవారం మడికొండ శివారు ఇండస్ట్రియల్‌ ఏరియలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల రాజబాబు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఉత్తములకు ప్రశంస



కలెక్టర్‌ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్‌ డేవిడ్‌

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్‌ అద్వైత్‌కుమార్‌ చేతుల మీదుగా ఉత్తమ అధికారులు ప్రశంసపత్రాలు అందుకున్నారు. -సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, మహబూబాబాద్‌



జె.చెన్నయ్య, ఏఎస్పీ, మానుకోట | అలివేలు, ఆర్డీఓ, మానుకోట | వెంకటేశ్వరబాబు, ఎస్డీపీఓ, తొర్రూరు | సత్యనారాయణ, ఎస్డీపీఓ, మానుకోట



లక్ష్మీనారాయణ, అగ్రికల్చర్‌ ఏడీ | సయ్యద్‌ కుర్షిద్‌, డీసీటీ | సూర్యనారాయణ, డీహెచ్‌ఎస్‌ఓ | నరసింహస్వామి, జీసీ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ | బాలరాజు, ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ | కిరణ్‌, డీపీఈఓ | సురేష్‌, గ్రౌండ్‌ వాటర్‌ ఆఫీసర్‌ | డాక్టర్‌ సుధాకర్‌, డీపీఐహెచ్‌ఓ | రమాదేవి, జేడీ, సీఈఓ | నర్మద, డిప్యూటీ సీఈఓ | హరిప్రసాద్‌, డీపీఓ | సన్యాసయ్య, డీఆర్‌డీఓ



సుబ్బారావు, సీపీఓ | కె.శ్రీనివాస్‌, డీపీఆర్వో | వెంకన్న, డీటీఓ | నరేష్‌కుమార్‌, ఎస్‌ఈ, ఎన్పీడీసీఎల్‌ | సురేష్‌, ఈఈ, పంచాయతీరాజ్‌ | కృష్ణారెడ్డి, ఈఈ, మిషన్‌ భగీరథ | తానేశ్వర్‌, ఈఈ, ఆర్‌అండ్‌బీ | వరలక్ష్మి, డీడబ్ల్యూఓ | ప్రసన్నరాణి, మున్సిపల్‌ కమిషనర్‌ | భగవాన్‌రెడ్డి, తహసీల్దార్‌, మానుకోట | వివేక్‌, తహసీల్దార్‌, నర్సింహులపేట | మాల్య, ఓఎస్డీ టు కలెక్టర్‌



రవీంద్రనాథ్‌, సీసీ టు కలెక్టర్‌ | నరేందర్‌, ఇన్‌స్పెక్టర్‌ | బాలాజీ వరప్రసాద్‌, ఇన్‌స్పెక్టర్‌ | రమేష్‌, ఇన్‌స్పెక్టర్‌ | సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్‌ | సోములు, ఆర్‌ఐ | శ్యాంసుందర్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌, ట్రాఫిక్‌ | రమేష్‌బాబు, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ | సునంద, ఆర్‌ఎస్సై | మౌలానా, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ | హెచ్‌.హుస్సేన్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ | వీరన్న, ఏఎస్సై



అనిత్‌కుమార్‌, ఆర్‌ఐ, పరేడ్‌ కమాండర్‌ | రాజు, మున్సిపల్‌ కమిషనర్‌, మరిపెడ | రవీందర్‌, ఫైర్‌మెన్‌ | సురేష్‌బాబు, జూనియర్‌ అసిస్టెంట్‌ | మధుసూదన్‌, డీఈ, ఎన్పీడీసీఎల్‌ | సయ్యద్‌ గౌస్‌, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ | శ్రీనివాస్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ | అక్రమ్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌, ఇంటెలిజెన్స్‌ | శ్రీనివాస్‌రెడ్డి, హెడ్‌ కానిస్టేబుల్‌ | ఖలీల్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ | రాములు, ఎస్టీటీ | ప్రవీణ్‌ కుమార్‌, ఎస్టీటీ

ప్రాణం మీదికి తెచ్చిన క్షణికావేశం

- సమక్క జాతరలో వర్కర్ల మధ్య గొడవ
- బార్‌ యజమాని బంధువు మందలింపు
- పెట్రోల్‌ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- 80శాతం కాలిన శరీరం.. పరిస్థితి విషమం

ఎస్‌ఎస్‌తాడ్వాయి/ఖిలా వరంగల్‌: విహార యాత్ర విషాదంగా మారింది. మద్యం మత్తులో వర్కర్ల మధ్య చోటుచేసుకున్న స్వల్ప ఘర్షణ.. బార్‌ యజమాని బంధువు మందలింపు..ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి దారితీసింది. ములుగు జిల్లా మేడారం జాతరలో శుక్రవారం జరిగిన ఘటన వివరాలు స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన మడిపెల్లి సతీష్‌(28) కొంతకాలంగా వరంగల్‌ కరీమాబాద్‌లోని ఓ బార్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వర్కర్ల అభ్యర్థన మేరకు శుక్రవారం తెల్లవారుజామున బార్‌ యజమాని ఓ వాహనంలో వర్కర్లను సమ్మక్క,సారలమ్మ దర్శనానికి పంపించారు. వారి వెంట బార్‌ యజమాని బంధువు కత్తి దేవేందర్‌ వెళ్లారు. ఉదయం అమ్మవార్ల దర్శనం అనంతరం మేక కోసి వంటలు చేసుకున్నారు. అందరు కలిసి మద్యం తాగుతుండగా.. అక్కడికి ఓ యాచకుడు రాగా.. అందరూ అతడిని తిట్టారు. తోటి వర్కర్ల తీరుపై అసహనం వ్యక్తం చేసిన సతీష్‌ భిక్షగాడికి రూ.50 అందజేశాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న వర్కర్లు.. సతీష్‌ మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అక్కడే ఉన్న బార్‌ యజమాని బంధువు మందలించాడు. యజమాని బంధువు అయితే నన్ను తిడతాడా అంటూ మనస్థాపానికి గురైన సతీష్‌ భోజనం చేయకుండానే బయటకు వెళ్లి ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి 80శాతం కాలిన గాయాలైన సతీష్‌ను 108 వాహనంలో ములుగు ఆస్పత్రికి పంపించారు. వైద్యుల సూచన మేరుగైన వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సతీష్‌

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్‌ దాడి



పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు

- మద్యం స్వాధీనం, నిర్వాహకులపై కేసు

ఖిలా వరంగల్‌ : అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై ఆకస్మికంగా దాడి చేసి రూ.1,80,440ల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌, పెండ్యాల దేవేందర్‌ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ పరిధి శాకరాసికుంట కాలనీకి చెందిన ఎనుగందుల రాజు, మామునూరు స్టేషన్‌ పరిధి తిమ్మాపురం గ్రామశివారు లక్ష్మీపురానికి చెందిన నాగప్ప శివ వేర్వేరుగా తమ ఇంట్లో భారీగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ మధుసూదన్‌ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌, పెండ్యాల దేవేందర్‌ ఆధ్వర్యంలో వేర్వేరుగా బెల్ట్‌షాపులపై దాడి చేశారు. ఈదాడుల్లో ఎనుగందుల రాజు ఇంట్లో సుమారు రూ.1,65,160ల విలువైన మద్యం బాటిళ్లు, లక్ష్మీపురం గ్రామానికి చెందిన నాగప్ప శివ ఇంట్లో రూ.15,280ల మొత్తం రూ.1,80,440ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని రాజు, శివపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌ టి.సురేష్‌, మామునూరు ఇన్‌స్పెక్టర్‌ క్రాంతికుమార్‌కు వేర్వేరుగా అప్పగించారు.ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ ఎస్సైలు ఈ.నర్సింహారావు, మామునూరు ఎస్సై కృష్ణవేణి, కానిస్టేబుళ్లు బాబ్‌సింగ్‌, వీరన్న పాల్గొన్నారు. వరంగల్‌ మిల్స్‌కాలనీ ఏసీరెడ్డినగర్‌కు చెందిన గడ్డం రమేష్‌ ఇంట్లో రూ.51,680ల విలువైన మద్యం, మామునూరు గ్రామానికి చెందిన సల్లూరి రాజేందర్‌ ఇంట్లో నిల్వ చేసిన రూ.26,440ల విలువ చేసిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

విద్యార్థినికి చేదు అనుభవం

- బస్సుల్లో తిరగడం అమ్మాయిలకు ఫ్యాషనైందంటూ మహిళా కండక్టర్‌ వెటకారం

పరకాల : కాంగ్రెస్‌ ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సదుపాయం కల్పించడం ఏమో కానీ ఓ విద్యార్థికి మహిళా కండక్టర్‌ నుంచి చేదు అనుభవం ఎదురైంది. నడికూడ మండలం నర్సక్కపల్లెకు చెందిన విద్యార్థిని మేఘన పరకాల నుంచి హుజురాబాద్‌ వెళ్లే బస్సెక్కింది. అయితే ఉచిత ప్రయాణం కావడంతో విద్యార్థిని తన వద్ద ఉన్న ఆధార్‌ కార్డు చూపించింది.. దీంతో మహిళ కండక్టర్‌ ఫొటో మార్చుకుంటే ఏమవుతుంది.. చిన్నప్పటి కార్డు ఉందా అంటూ వెటకారంగా మాట్లాడింది. కాగా తాను అప్‌డేట్‌ చేసుకున్నానని చెప్పిన పట్టించుకోలేదని.. అలా మాట్లాడకండి అవసరమైతే డబ్బులు తీసుకొమ్మని చెప్పింది. పైసలు ఎక్కువైనాయా.. అయిన కాలేజీ అమ్మాయిలకు పనిపాట లేకుండా బస్సుల్లో తిరగడం ఫ్యాషనైందనడంతో బస్సులోనే ఆ విద్యార్థి కంటతడి పెట్టుకుంది. ఈ విషయాన్ని తన తండ్రికి ఫోన్‌లో తెలియజేయగా అతను పరకాల ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు డిపోకు చేరుకున్నాడు. డీఎం కొత్త బస్సుల ప్రారంభోత్సవం బిజీగా ఉండటంతో అక్కడే ఉన్న కొందరు ఆర్టీసీ ఉద్యోగులు మరోసారి అలా జరగకుండా చూసుకుంటామంటూ నచ్చజెప్పారు. అయితే ఓ వైపు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కొత్త బస్సులు ప్రారంభిస్తుండగా ఈ సంఘటన జరగడం విశేషం. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం రవిచంద్ర దృష్టికి సాక్షి తీసుకెళ్లగా ఆధార్‌ అప్‌డేట్‌ చేసుకొమ్మని చెప్పడంలో తప్పులేదన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేటినుంచి అన్నారం దర్గా ఉర్సు

- మూడు రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తుల రాక



విద్యుత్‌ దీప కాంతుల్లో దర్గా

పర్వతగిరి : వరంగల్‌ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్‌ గ్రామంలో హజ్రత్‌ సయ్యద్‌ యాకూబ్‌ షావలి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు నేటినుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి దర్గాను దర్శనం చేసుకోనున్నారు. ఉర్సు ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు(శనివారం) రాత్రి ఖవ్వాలి గేయాలాపన, గంధం ఊరేగింపు, రెండో రోజు (ఆదివారం) దీపారాధన, భక్తులకు మహా అన్నదానం, మూడో రోజు(సోమవారం) ఖత్మల్‌ ఖురాన్‌లతో ఉత్సవాలు ముగుస్తాయి. దర్గాకు ముస్లింలతో పాటు హిందువులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

ఉత్సవాలకు నిధుల మంజూరు



అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ వక్ఫ్‌బోర్డు నుంచి రూ.7.10లక్షలు మంజూరయ్యాయి. దర్గాతో పాటు చిల్లాల పెయింటింగ్‌, తాగునీరు, శానిటేషన్‌, మరుగుదొడ్లతో పాటు అన్నదానం, ఇతర సదుపాయాలకు కేటాయించి ఏర్పాట్లు పూర్తి చేశాము.

-రియాజ్‌, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌

భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం..



అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. యాకూబ్‌ బాబా అనుగ్రహంతో ప్రతీ ఏటా బాబాకు గంధం సమర్పించేందుకు ముజేవార్ల ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్తారు. గంధం తీసుకెళ్లే సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి దర్గాలో గంధం సమర్పిస్తాం.

-ఖాజాపాషా, ముజేవార్‌

పోలీసుల బందోబస్తు



గంధం ఊరేగింపునకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం. భక్తులను క్యూలో నిలబెట్టడానికి, ట్రాఫిక్‌ మళ్లింపు, వాహనాల పార్కింగ్‌, దొంగతనాల నివారణకు క్రైం పార్టీ, గంధం ఊరేగింపునకు స్పెషల్‌ పార్టీ పోలీసులు విధులు నిర్వహిస్తారు. దర్గా వద్ద కంట్రోల్‌ రూం ఏర్పాటు చేసి బందోబస్తు పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. భక్తులు, ఉత్సవ నిర్వాహకులు, పోలీసులకు సహకరించాలి.

- వీరభద్రరావు, ఎస్సై, పర్వతగిరి

16 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితుడి అరెస్ట్‌



నిందితుడితో పాటు పట్టుబడిన గంజాయిని చూపుతున్న సీఐ చంద్రమోహన్‌

కాజీపేట : కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 16కిలోల ఎండుగంజాయి లభ్యమైందని ఎక్సైజ్‌ సీఐ చంద్రమోహన్‌ తెలిపారు. ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. రైలు ద్వారా ఒడిశా రాష్ట్రం నుంచి నిషేధిత గంజాయి రవాణా చేస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం రైల్వే స్టేషన్‌లో మకాం వేసి నిందితుడు సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని సీజ్‌ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్‌ ఖలీల్‌, కోటి, వీరమల్లు, రవీందర్‌, లాలయ్య, ఆయుబ్‌ పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి



గోపాల్‌ (ఫైల్‌)

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టకు చెందిన గీతకార్మికుడు ఉమ్మగోని గోపాల్‌(52) శుక్రవారం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై వినయ్‌కుమార్‌ తెలిపిన వివరాలు.. గీత వృత్తే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న గోపాల్‌ రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడి తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ తెలిపారు. కాగా కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గణగోని రమేష్‌, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, వెంకటేశ్వర్లుతో పాటు పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు కోరారు.

ట్రాక్టర్‌ బోల్తా.. డ్రైవర్‌..



సురేష్‌(ఫైల్‌)

నర్సింహులపేట : మండలంలోని బొజ్జన్నపేట గ్రామ పరిధిలో శుక్రవారం ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్‌ మృతిచెందాడు. ఎస్సై గండ్రాతి సతీష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌ మండలంలోని సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్‌(30) బొజ్జన్నపేట గ్రామ పరిధి నుంచి ట్రాక్టర్లో మట్టిని తరలిస్తున్నాడు. ఈక్రమంలో కాల్వ సమీపంలో ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తా పడటంతో సురేష్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్రావణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్‌ తెలిపారు.